# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి | ఆదివారం 29-09-2024 | సంపుటి : 06 | సంచిక : 05 | పేజీలు : 8 | వెల : రూ 3-00


### పెనుగొండ సిఐగా రాయుడు విజయ్ కుమార్

పెనుగొండ సెప్టెంబర్ 28 పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా రాయుడు విజయ్ కుమార్ భాద్యతలు స్వీకరించారు. ఈయన విజయవాడలో సింగ్ నగర్ ట్రాఫిక్ స్టేషన్ నుండి బదిలీ అయ్యి పెనుగొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బదిలీ పై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా సిఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ పెనుగొండ సర్కిల్లో శాంతి భద్రతలు పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే సహించేది లేదని అటువంటి వారికి కఠిన చర్యలు తప్పవని అన్నారు అలాగే ప్రజల సహకారం కూడా అవసరమని అన్నారు






# వేర్పాటువాదం..రక్తపాతానికి చోటులేదు

### బిజెపి పాలన కోరుకుంటున్న కాశ్మీర్‌లో ప్రజలు
### మూడో విడత ప్రచారాంలో ప్రధాని మోడీ



జమ్మూ,సెప్టెంబర్28: తొలి రెండు విడతల పోలింగ్ అనంతరం జమ్మూకశ్మీర్లో తొలిసారి పూర్తి మెజారిటీతో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమైందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. అక్టోబర్ 1న తుది విడత పోలింగ్ నేపథ్యంలో శనివారంనాడిక్కడ జరిగిన ఎన్నికల ప్రచార సభలో మోదీ పాల్గొన్నారు. ఉగ్రవాదం, అవినీతి అంశాలకు సంబంధించి కాంగ్రెస్, దాని భాగస్వామ్య పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్, మెహబూబా ముఫ్తీ సారథ్యంలోని పీడీపీపై విమర్శలు గుప్పించారు. మొదటి రెండు విడతల పోలింగ్ సరళితో బీజేపీ తొలిసారి జమ్మూకశ్మీర్‌లో పూర్తి మెజారిటీ సాధించడం ఖాయమైంది. బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారు. రెండు విడతల్లో ప్రజలు భారీగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో బీజేపీ గెలుపు తథ్యమైందని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ప్రజల అభిమతంతో తొలిసారి జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వం ఏర్పడనుందని, ఇక్కడ ఎన్నో ఆలయాలు ఉన్నాయని, ఈ అవకాశాన్ని వదులుకోవద్దని, బీజేపీ ప్రభుత్వం ప్రజల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తుందని భరోసా ఇచ్చారు. జమ్మూకశ్మీర్‌లోని కాంగ్రెస్, ఎన్‌సీ, పీడీపీల 'మూడు కుటుంబాల' పాలనతో ప్రజలు విసిగిపోయారని, ప్రజలు శాంతిని కోరుకుంటున్నారని ప్రధాని అన్నారు. అవినీతి, ఉద్యోగాల్లో వివక్ష తిరిగి చోటుచేసుకోరాదని, వేర్పాటువాదం, రక్తపాతానికి ఇంకెంత మాత్రం చోటులేదని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడి ప్రజలు శాంతిని కోరుకుంటున్నారు. తమ పిల్లలకు మంచి భవిష్యత్తును ఆశిస్తున్నాను. ఆ కారణంగానే జమ్మూకశ్మీర్ ప్రజలు బీజేపీ పాలన రావాలని కోరుకుంటున్నారు' అని మోదీ అన్నారు. 2016 సెప్టెంబర్ 18న భారత్ చేపట్టిన సర్జికల్ దాడులను ప్రధాని గుర్తుచేస్తూ, సరిహద్దు ఉగ్రవాదంపై సర్జికల్ దాడులతో ప్రపంచానికి తాము విస్పష్టమైన సందేశం ఇచ్చామని, ఇది న్యూ ఇండియా అని, ఉగ్రవాదాన్ని సహించేది లేదని చాలా స్పష్టంగా తెలియజేశామని అన్నారు. ఉగ్రవాదులు తెగబడితే వారెక్కడున్నా మోదీ వెతికి పట్టుకుంటారనే విషయం వారికి బాగా తెలుసునన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం సర్జికల్ దాడులకు ఆధారాలు చూపెట్టమని ఆర్మీని నిలదీస్తోందని ప్రధాని విమర్శించారు. కాగా, అక్టోబర్ 1న జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల తుది (మూడవ) విడత పోలింగ్ జరుగనుంది. అక్టోబర్ 8న ఫలితాలు వెలువడతాయి.

# హోసూర్ లో టాటా ఎలక్ట్రానిక్స్ తయారీ యూనిట్ లో భారీ అగ్ని ప్రమాదం

న్యూఢిల్లీ: హోసూర్(తమిళనాడు-కర్నాటక): తమిళనాడు సరిహద్దు హోసూర్ లో ఉన్న టాటా ఎలక్ట్రానిక్స్ తయారీ యూనిట్ లో శనివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. సెల్ ఫోన్ తయారీ సెక్షన్ లో మొదట మంటలు చెలరేగాయి. తర్వాత కార్మికులందరినీ అక్కడి నుంచి ఖాళీచేయించేశారు. ఈ అగ్ని ప్రమాదంలో గణనీయమైన ఆస్తి నష్టం జరిగిందని సమాచారం. ప్రస్తుతం అగ్నిమాపక దళాలు మంటలు ఆర్పే పనిలో




ఉన్నారు. స్థానికుల ప్రకారం నాగమంగళం సమీపంలోని ఉద్దనపల్లిలోని కంపెనీ మొబైల్ ఫోన్ యాక్ససరీస్ పెయింటింగ్ యూనిట్లో మంటలు మొదలయ్యాయి. దట్టమైన అతి త్వరగా వ్యాపించడంతో కార్మికులు, స్థానికులు హతాశులయ్యారు. కార్మికలను ఆ ప్రాంతం నుంచి ఖాళీ చేయించి అగ్నిమాపక దళాలు మంటలు ఆర్పే పనిని చేపట్టాయి. ప్రస్తుతానికి ఎవరికీ గాయాలయిన సమాచారం లేదు. కేవలం ఆస్తి నష్టం మాత్రమే జరిగింది.మంటలు చెలరేగినప్పుడు డ్యూటీలో దాదాపు 1500 మంది కార్మికులు పనిలో ఉన్నారు. కాగా ముగ్గురు కార్మికులకు ఊపిరి పీల్చుకోవడం కష్టంగా ఉందని పోలీసులు తెలిపారు. వారిని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

# జగన్ డిక్లరేషన్ ఎందుకివ్వరు

### జగన్ తీరు పై బుద్దా వెంకన్న ఫైర్

విజయవాడ ,తిరుమల ను స్వార్ధ రాజకీయాల కోసం జగన్ వాడటం నీచమని టీడీపీ నేత బుద్దా వెంకన్న అన్నారు. తిరుమల వెళతానన్న జగన్.. నిన్న సాయంత్రం తనకు అనుమతి ఇవ్వలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. మనం అనుకుంటే కాదు... ఆ స్వామి అనుగ్రహిస్తేనే మనం వెళ్లగలం. వెంకన్న స్వామి అనుమతి లేదు కాబట్టే జగన్ వెళ్లలేకపోయాడు. బైబిల్ ఇంట్లో చదువుకునే జగన్ కు వెంకన్న మీద నమ్మకం ఉందని డిక్లరేషన్ ఎందుకు ఇవ్వరని అడిగారు.నిబంధనల మేరకు డిక్లరేషన్ అడిగితే రాద్ధాంతం ఎందుకు. నీ ఇంట్లో నీ భార్యని కూడా తిరుమల తీసుకు రాలేవు. సిఎం హోదాలోనే నీఇంట్లో వాళ్లు నీ మాట వినలేదు. ఇప్పుడు టిడిపి పై బురద జల్లాలని చూస్తున్నారు. గతంలో తిరుమల ఆలయ పరిసరాల్లో జగన్ చెప్పులు వేసుకుని తిరిగాడు. ఇప్పుడు నెయ్యి కల్తీ వివాదంలో మీ పాత్ర ఉంది. అందుకే వైవి సుబ్బారెడ్డి ని వెనుకేసుకు వస్తున్నావు. తిరుమల సాక్షి గా తప్పుచేయలేదని చెప్పే ధైర్యం ఉందా. ఆ స్వామి ఆశీస్సులు చంద్రబాబు కి ఉన్నాయి. మావోయి స్ట ల దాడి నుంచి వెంకన్న స్వామి చంద్రబాబు ను ఆనాడు కాపాడారు. వైసిపి హయాంలో తిరుమల లో అపవిత్రం జరిగింది. అదే అడిగితే చంద్రబాబు పై విమర్శలు చేస్తావా. నువ్వు తిరుమల రావడం ఆ స్వామికే ఇష్టం లేదు. అందుకే ఆయన నిన్ను రానివ్వకుండా నీకు నువ్వే ఆగేలా చేశాడు. జగన్ జమానాలో అన్ని అవినీతి, అక్రమాలే. ప్రభుత్వం వీటి పై విచారణ చేయడంతో జగన్ లో భయం పట్టుకుంది. అందుకే



ఇప్పుడు ప్రతి అంశాన్ని కుల, మతాల వారీగా వివాదం చేస్తున్నారు. మానవ కులం నీదేంటి..మా అందరిదీ మానవ కులమే. జగన్ ఇప్పుడు అయినా బుద్ధి తెచ్చుకో.. తీరు మార్చుకో అని అన్నారు.కలుగులో దాక్కున్న వంశీ, కొడాలినాని లు ఇప్పుడు బయటకి వచ్చారు. మొక్కుబడులు ఉంటే తల నీలాలు ఇస్తారు. ఈవిషయం కూడా తెలియకుండా చంద్రబాబు గుండు కొట్టించుకుంటారా అని జగన్ అడిగాడు. ఆయన ప్రతి యేడాది కోటి రూపాయలు విరాళం ఇస్తారు. నువ్వు ఒక్క రూపాయి అయినా విరాళం ఇచ్చావా. నిన్ను స్వామివారే ఆపారు... నువ్వు రావడం ఆయనకి ఇష్టం లేదు. మొదటి జాబితాలో నీ పేరు లేదని కొంతమంది వాగుతున్నారు.

# ఎస్సీ, ఎస్టీ అత్యాచారానికి గురైన బాధితులకు సత్వర న్యాయం అందించండి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 28-షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ జాతులు, అణగారిన వర్గాల ప్రజలపై దాడులు, అత్యాచారానికి గురైన బాధితులకు సత్వర న్యాయం, పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శనివారం కలెక్టరేట్ లోని సెంటనరీ హాలులో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ ఏ పద్మజ, సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, కమిటీ సభ్యులు చిటికెల సలోమి, ఎన్. రమేష్, జీవన్ రాజు, దిలీప్ రాజు, శ్రీనివాసులు, మమత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా




కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అత్యాచారానికి గురైన బాధితులకు సత్వర న్యాయం అందించడంతోపాటు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని సూచించారు. కమిటీ సభ్యులు సూచించిన మేరకు అన్ని గ్రామాలలో స్మశాన వాటిక సమస్యల ఉందని గతంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి స్మశాన వాటికల సమస్యలు కొంతవరకు పరిష్కరించామని మరోమారు భూములను గుర్తించి ఏర్పాటు చేసే బాధ్యత తీసుకుంటామన్నారు. నంద్యాల పట్టణంలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు కమిటీ సభ్యులతో చర్చించి త్వరితగతిన నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అలాగే కార్మికులకు గ్లౌజులు, మాస్కులు, అందజేయడంతో పాటు ఇతర రక్షణ బాధ్యతలు తీసుకుంటామన్నారు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా కార్మికులందరికీ 74 రకాల ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు కూడా సరఫరా చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, డిఎస్పీలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ హై కోర్టు జడ్జి డా.జస్టిస్ కె.మన్మధ రావుని మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్, ఎస్పీ

### పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్, ఎస్పీ లు

విభారే న్యూస్ కర్నూలు, ప్రతినిధి సెప్టెంబర్ 28:- ఆంధ్రప్రదేశ్ హై కోర్టు జడ్జి ఉ అడ్మినిస్ట్రేటివ్ జడ్జి ఆఫ్ కర్నూలు జ్యూడిషియల్ డిస్ట్రిక్ట్ (కర్నూలు, నంద్యాల) డా.జస్టిస్ కె.మన్మధ రావు గారిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ బిందు







మాధవ్ లు మర్యాదపూర్వకంగా కలిశారు..కర్నూలు డిస్ట్రిక్ట్ కోర్టు కాంప్లెక్స్ లో జరగనున్న డిస్ట్రిక్ట్ జ్యూడిషియల్ ఆఫీసర్స్ వర్క్ షాప్ లో, అదే విధంగా ఈ నెల 29 వ తేదిన జరగనున్న డిస్ట్రిక్ట్ లెవెల్ జ్యూడిషియల్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ హై కోర్టు జడ్జి ఉ అడ్మినిస్ట్రేటివ్ జడ్జి ఆఫ్ కర్నూలు జ్యూడిషియల్ డిస్ట్రిక్ట్ (కర్నూలు, నంద్యాల) డా.జస్టిస్ కె.మన్మధ రావు గారిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ బిందు మాధవ్ లు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. తదనంతరం జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి విషయాల పై చర్చించారు...

# జిల్లాలో క్విక్ రియాక్షన్ టీంల ఏర్పాటు...

### జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 28-నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ నేర నివారణే లక్ష్యంగా జిల్లాలో కొంతమంది సిబ్బందిని ఏర్పాటు చేసుకొని వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడంతోపాటు యోగ, మార్షల్ ఆర్ట్స్, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన చర్యలు మరియు దేహదారుఢ్యం పై శ్రద్ధ తీసుకునేలా శిక్షణ ఇచ్చి ప్రతి సబ్ డివిజన్ కి 11 మంది చొప్పున నియమించడం జరిగిందని తెలిపారు .ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సబ్ డివిజన్ నుండి 11 మందిని క్విక్ రియాక్షన్ టీం లుగా ఏర్పాటుచేసి వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇవ్వడం జరిగిందని ,వీరు సబ్ డివిజన్ హెడ్ క్వార్టర్ లో ఉంటూ స్పెషల్ పార్టీ ఎక్విప్మెంట్ ధరించి



ఏదైనా అనుకోని సంఘటనలు జరిగినప్పుడు శాంతిభద్రతల పరిరక్షణలో ముందు ఉండే లాగున శిక్షణ ఇవ్వడం జరిగిందని ఈ శిక్షణలో వారికి సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ (మార్షల్ ఆర్ట్స్) , యోగ ,సర్వైవల్ ట్రైనింగ్, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ విధులు నిర్వహించేలా శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు, ప్రముఖుల బందోబస్తు విధులు మొదలగు వాటిలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గారితో పాటు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ విజయ భాస్కర్ , ఎలీషా వలి , ఇన్స్పెక్టర్ మోహన్ రెడ్డి , ఇన్స్పెక్టర్ ఆదినారాయణ ఆర్ముడు రిజర్వ్ ఇన్స్పెక్టర్ మంజునాథ్ , శ్రీనివాసులు , దాదాపీరా టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

# సంపాదకీయం

ఆదివారం 29-09-2024

## భద్రతా మండలిలో శాశ్వత భారత్.. ఇక లాంఛనమే

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కావాలని భారత్ ఎప్పటి నుంచో కోరుతోంది. ఈమేరకు అనేక ప్రయత్నాలు చేస్తోంది. ఈ ప్రయత్నాలు ఫలిస్తున్నట్లే కనిపిస్తోంది. ప్రపంచంలోని అగ్ర దేశాలతో భారత్ జరుపుతున్న సంప్రదింపులు.. గడిచిన పదేళ్లలో భారత్ సాధించిన ఆర్థిక ప్రగతి చూసి.. అనేక దేశాలు భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని కోరుతున్నాయి. ఇటీవలే అమెరికా కూడా భారత్‌కు శాశ్వత సభ్యత్వానికి మద్దతు తెలిపింది. తర్వాత ఫ్రాన్స్, తాజాగా యూకే కూడా భారత్ శాశ్వత సభ్యత్వానికి మద్దతు ప్రకటించాయి. న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 79వ సాధారణ చర్చను ఉద్దేశించి మాట్లాడిన బ్రిటన్ ప్రధాని కైర్ స్టార్మర్ యూఎన్‌సీసీ మరింత ప్రాతినిధ్య సంస్థగా మారాలన్నారు. ఇందులో భాగంగానే యూకే పలు దేశాలకు శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని కోరుతోందని తెలిపారు. భారత్, బ్రెజిల్, జపాన్, జర్మనీ భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాలుగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపింది. ఆఫ్రికన్ దేశాల ప్రాతినిధ్యం కూడా చూడాలని అనుకుంటున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే భారత్ శాశ్వత సభ్యత్వానికి మద్దతు ఇస్తామని ప్రకటించారుఇక అంతకు ముంద ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం గురించి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మాక్రన్ కూడా మాట్లాడారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో మాట్లాడుతూ భద్రతా మండలిలో భారత్ శాశ్వత సభ్యదేశంగా ఉండేందుకు తాము మద్దతు ఇస్తామని తెలిపారు. భద్రతా మండలిని విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇందుకు ఫ్రాన్స్ అనుకూలంగా ఉందని తెలిపారు. ఆఫ్రికాలోని రెండు దేశాలతోపాటు జపాన్, జర్మనీ, ఇండియా, బ్రెజిల్‌కు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కల్పించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు.ఇక గతవారం ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వానికి అమెరికా కూడా మద్దతు ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఈమేరకు భారత ప్రధాని నరేంద్రమోదీకి స్వయంగా హామీ ఇచ్చారు. మూడు రోజుల పర్యటనకు అమెరికా వెళ్లిన మోదీ.. బైడెన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా స్పష్టమైన హామీ ఇచ్చారు.ఇదిలా ఉంటే.. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం ఉన్న మూడు కీలక దేశాలు అమెరికా, యూకే, ఫ్రాన్స్.. భారత్‌కు శాశ్వత సభ్యత్వం విషయంలో మద్దతు ఇవ్వడం శుభ పరిణామంగా చెప్పవచ్చు.ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు ప్రపంచవ్యాప్తంగా మద్దతు పెరుగుతోంది.భద్రతా మండలి ఐక్యరాజ్య సమితికి అనుబంధంగా ఏర్పడి దాదాపు 75 ఏళ్లు అవుతోంది.ప్రస్తుతం అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ మాత్రమే శాశ్వత సభ్యదేశాలుగా ఉన్నారు. మిగతా దేశాలు తాత్కాలిక సభ్యులుగా రొటేషన్ పద్ధతిలో మారుతుంటాయి.భారత్ అనేక సంవత్సరాలుగా శాశ్వత సభ్యత్వం కోసం పోరాడుతుండగా, ఐదు శాశ్వత దేశాల్లో నాలుగు దేశాలు మాత్రం భారత్‌కు మద్దతు ఇస్తున్నాయి. గతంలో ఫ్రాన్స్ ఒక్కటే మద్దతు ఇచ్చింది. అమెరికా, బ్రిటన్, చైనా వ్యతిరేకించాయి. ప్రస్తుతం భద్రతామండలిలో ఐదు శాశ్వత సభ్యదేశాలు, పది తాత్కాలిక సభ్య దేశాలు ఉన్నాయి. ఇవి రెండేళ్లకోసం ఎన్నుకోబడతాయి. శాశ్వత సభ్య దేశాలుగా రష్యా, అమెరికా, ఫ్రాన్స్, యూకే, చైనా ఉన్నాయి. ఐదు దేశాల్లో నాలుగు దేశాలు భారత్‌కు మద్దతుగా నిలిచాయి. ఇక శాశ్వత సభ్య దేశాలకు ఏదైనా ముఖ్యమైన తీర్మానాన్ని వీటో చేసే అధికారం ఉంది.ఐరాస భద్రతా మండలిలో ఇండియాకు శాశ్వత సభ్యత్వం కోసం చాలా సంవత్సరాలుగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ ఆ ప్రతిపాదన వచ్చిన ప్రతీసారి చైనా వీటో చేస్తుంది. దీంతో ఇండియాకు శాశ్వత సభ్యత్వం లభించడం లేదు. అయితే ఈ సంవత్సరం శాశ్వత సభ్యులుగా ఉన్న 5 దేశాలలో మూడు దేశాలు.. అమెరికా, ఫ్రాన్స్, యుకె ఇండియాకు శాశ్వత సభ్యత్వం కోసం మద్దుతు తెలిపాయి. యుకె ప్రధాని కంటే ముందు అమెరికా, ఫ్రాన్స్ దేశాల ప్రెసిడెంట్లు జో బైడెన్, ఎమానుయెల్ మాక్రాన్ కూడా ఇండియాకు శాశ్వత సభ్యత్వం ఇవ్వాలని అన్నారు. యుకె ప్రధాని కంటే ఒక్కరోజు ముందు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమానెయెల్ మాక్రాన్ ఐరాస భద్రతా మండలిలో భారత్ కు సభ్యత్వం కల్పించాలని గట్టిగా వాదించారు. ఆయన బుధవారం సమావేశాల్లో మాట్లాడుతూ.. "భద్రతా మండలిలో అడ్డంకులు ఉన్నంత కాలం మనం ముందుకు సాగలేం. ఐకరాజ్య సమితిని సమర్థవంతంగా చేయాలంటే ముందు భద్రతా మండలి మరిన్ని దేశాలకు ప్రాతినిధ్యం కల్పించాలి. ఫ్రాన్స్ ఇదే చెబుతోంది. జర్మనీ, జపాన్, ఇండియా, బ్రెజిల్ దేశాలు, ఆఫ్రికా ఖండం నుంచి రెండు దేశాలకు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కల్పించాలి." అని మాక్రాన్ అన్నారు.అంతకుముందు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమెరికాలో క్వాడ్ దేశాల సమావేశాలకు వెళ్లినప్పుడు ప్రెసిడెంట్ జో బైడెన్ కూడా ఇదే మాట అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సమస్యలు వస్తే.. వాటిని పరిష్కరించేందుకు ఇండియా ఎప్పుడూ ముందు ఉంటుంది.

## పాలకొమ్మ చెట్టు తిరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 28-: పాలకొమ్మ చెట్టు పైనే కౌన్సిల్ సమావేశం వాడివేడిగా సాగింది. మున్సిపల్ పురపాలక కార్యాలయంలో ఛైర్పర్సన్ మాబున్నీసా అధ్యక్షతన తో శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం వాడివేడిగా సాగింది. సమావేశంలో అజెండా లోని 11 అంశాలపై చర్చ జరుగుతున్న సమయంలో ఎన్జీఓ కాలనీలోని లలితా నగర్ నుంచి పాల కేంద్రం వరకు 80 అడుగుల రోడ్డు ను 30 అడుగుల వరకు కుదించడంలో అటు టీడీపీ. ఇటు వైసీపీ కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఛైర్ పర్సన్ మాబున్నిసా పాస్ చేయకుండా రద్దు చేసింది. మిగతా అజెండా అంశాలను ప్రవేశపెట్టగా అన్నింటికీ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అనంతరం పలువురు సభ్యులు తమ వార్డుల్లోని సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. మరికొందరు తమ వార్డుల్లోని అభివృద్ధి పనులు జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ కౌన్సిలర్లు ప్రతాప్ టాకిస్ మేయిన రోడ్డు లో పాల కొమ్మ చెట్టు గతంలో ఉండేదని అదిప్పుడు లేకుండా చేసి అక్రమంగా నిర్మిస్తున్న షాపు కు ఎవరూ పరిమిషన్ ఇచ్చారని విషయం పై సభ లో వైసీపీ కౌన్సిలర్లు పట్టుబట్టారు. టిడిపి కౌన్సిలర్ ఖండే శ్యాంసుంధర్ లాల్ లేసి అక్కడ గతంలో పాలకొమ్మ చెట్టు ఉండేదని రోడ్డు విస్తరణ లో తొలగించారని పక్కన ఉన్న సెంటుంపావులో నిర్మిస్తున్న షాపు యజమానులకు అన్ని రికార్డులు ఉన్నాయని తెలిపారు. దీనిపై వైసీపీ కౌన్సిలర్లకు టిడిపి కౌన్సిలర్ల వాదవవాదలు జరిగాయి. ఈ విషయంపై ఛైర్ పర్సన్ మాబున్నిసా కలుగజేసు కొని అక్కడ నిర్మాణాలను ఆపాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్లు , కో ఆప్షన్ సభ్యులు. కమిషనర్ నిరంజన్ రెడ్డి. అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి. ఎమ్ ఈ. గుర్రప్ప యాదవ్. డీఈ లు జయబారత్ రెడ్డి. మదు కుమార్. నాగ భూషణం రెడ్డి .శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ శివ ప్రసాద్ రెడ్డి. మురళీధర్ తదితరులు పాల్గొన్నారు ,

## ఘనంగా భగత్ సింగ్, గుర్రం జాషువాల జయంతి.....





విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-సెప్టెంబర్ 28 డోన్ పట్టణం పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ అధ్యక్షతన భగత్ సింగ్, గుర్రం జాషువా జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు సమర్పించి నివాళులర్పించినట్లు వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఈసందర్భంగా దేవేంద్రప్ప, బాబు మాట్లాడుతూ గబ్బిలం, పిరదౌసి లాంటి గ్రంథాలను రచించి, ప్రజలను మేల్కొలిపిన కవి గుర్రం జాషువా అన్నారు. అలాగే 23 ఏళ్ళ వయసులోనే స్వాతంత్ర్యసమర యోధుడుగా పోరాడి, ఉరికొయ్యను ముద్దాడిన వ్యక్తి భగత్ సింగ్ అని కొనియాడారు. జలియన్ వాలా బాగ్ ఉదంతం తర్వాత భగత్ సింగ్ ఉద్రేకంతో, ఆవేశం తో ఎలాగైనా తెల్ల దొరల పాలన నుండి విముక్తి కావాలని ఆశించి, అనేక కష్టనష్టాలను చవిచూసిన మహనీయుడు భగత్ సింగ్ అని, అలాంటి వారి అడుగు జాడల్లో నిలవాలన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట రమణ, రఘునాథ్ ఎస్తేరమ్మ, రమేష్, సంజీవరెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మయ్య,లక్ష్మి కాంతరెడ్డి,రాధ, అల్లిపీరా, మద్దిలేటి, విజయకుమార్, సుబాన్, జయసుబ్బారాయుడు, శివన్న, ఆదినారాయణ, సురేష్, మధుసూదన్ రెడ్డి, లీలావతమ్మ, భాను ప్రకాష్ రెడ్డి, భారతి, లక్ష్మి ప్రభావతి, హుస్సేన్ భాను, మహేష్, అల్లిపీరా,తదితరులు పాల్గొన్నారు

## బైరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలసిన రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ సుబ్బారెడ్డి....



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి:-సెప్టెంబర్ 28 ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గా నూతనంగా నియమితులైన సందర్భంగా శనివారం కర్నూలులో బైరెడ్డి రాజశేఖరరెడ్డి ని, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరమ్మ ని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. వారు ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి కి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డోన్ పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు, యువ నాయకులు ధర్మవరం మన్నే గౌతమ్ రెడ్డి తదితరులు ఉన్నారు

## వల్లి మోహన్,యువజన సేవాసమితి ఆధ్వర్యంలో వృద్ధులకు బియ్యం,నిత్యవసర వస్తువులు పంపిణీ.

తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 28 )పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంవల్లిమోహన్, యువజన సేవాసమితి సమావేశం ఇందిరానగర్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సమావేశానికి ఇందిరాకాలనీ సేవాసమితి అధ్యక్షులు ఉండ్రాజవరపు భాస్కరరావు అధ్యక్షతన వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పటాన్ వల్లి విచ్చేశారు. సేవాసమితి ఆధ్వర్యంలో జరిగే నెలవారి కార్యక్రమం లో భాగంగా, తన తండ్రి యడవల్లి సుబ్బరాజు 4 వ, వర్షంతి సందర్భంగా కుమారుడు యడవల్లి మధు ఆధ్వర్యంలో,కుంటి వేపచెట్టు ఇందిరా కాలనీకి చెందిన నలుగురు నిరుపేద వృద్ధ మహిళలకు 20 కేజీల బియ్యం, ఆయిల్ ప్యాకెట్స్, నిత్యవసర వస్తువులు, కూరగాయలు, అందజేశారు ఇటువంటి మంచి కార్యక్రమాలు చేస్తున్న వారిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో, సేవా సమితి గౌరవ అద్యక్షులు ఆడపా తిలక్,సేవాసమితి కార్యదర్శి గొల్లేరు మోహన్, కోశాధికారి మెంటే రాంబాబు, దాసరి హరిష్ .యు.వి. సునీత, జాలి దానయ్య, బచ్చు దిహేష్, .షేక్ బాషా, పోలిశెట్టి రంగారావు, నేదూరి సత్యనారాయణ, కొండేటి శ్రీను, భరణికల సత్యనారాయణ, కామిశెట్టి మూర్తి,కొప్పుల దుర్గాప్రసాద్ పోతు శ్రీనివాస్, కోడేటి శ్రీరామ్, జంజులూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు




## డి.ఎస్.పి ని సన్మానించిన నేషనల్ యాంటీ కరప్షన్ సభ్యులు..



విభారె న్యూస్ ఎమ్మిగనూర్ సెప్టెంబర్ 28.. ఎమ్మిగనూరు నియోజక వర్గం ఎమ్మిగనూరు పట్టణం నూతన డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఉపేంద్ర బాబు ని నేషనల్ యాంటీ కరప్షన్ కమిటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ టీం మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. నేషనల్ యాంటీ కరప్షన్ కమిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ రాజేష్ శుక్లాజీ, కేంద్ర ప్రధాన కార్యదర్శి శ్రీమతి రోజా షేక్ మేడం, ఆంధ్ర ప్రదేశ్ ఇంచార్జ్ మాధుగుండు ఈరన్న ఆదేశాల మేరకు కలవడం జరిగింది ఆంధ్ర టీం తరపున శాలువాతో సత్కరించి పూల మొక్కను అందించడం జరిగింది. ఈ సందర్భంగా డిఎస్పి ఉపేంద్ర బాబు మాట్లాడుతూ నేషనల్ యాంటీ కరప్షన్ కమిటీ ఆఫ్ ఇండియా టీం అవినీతి నిర్మూలనలో తమ పాత్ర కీలకమన్నారు.విద్యార్థినివిద్యార్థులకు డ్రగ్స్ మారకద్రవ్యాలు, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛందంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తే తాము కూడా సహకరిస్తాను అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ వైస్ ఛైర్మన్లు టీ జే ప్రకాష్ రావు,సుబ్బారెడ్డి , కర్నూలు జిల్లా ఛైర్మన్ ఛాయా వీరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జునరావు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎ పి జె ఎ సి రాష్ట్ర కార్యదర్శిగా ఆప్టా కాకి ప్రకాష్ రావు..



విభారె న్యూస్ సెప్టెంబర్ 28 కర్నూలు జిల్లా ప్రతినిధి.. శనివారం రోజు విజయవాడ లో జరిగిన ఎ పి జె ఎ సి రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక లో కర్నూలు జిల్లా కర్నూలు మండలము ఎం పి పి ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గా పని చేయుచున్న కాకి ప్రకాష్ రావు రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావడం జరిగింది.ఎ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా వున్న కాకి ప్రకాష్ రావు ఉపాధ్యాయ సంక్షేమ కార్యక్రమాలు, ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ మొట్టమొదట సారిగా ఆప్టా సంఘం నుండి ఎ పి జె ఎ సి రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక అయినందున ఆప్టా కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎం మధుసూదన రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సేవలాల్ నాయక్, జిల్లా కోశాధికారి వినోద్ కుమార్ ఆప్టా రాష్ట్ర నాయకులు మునగాల మధుసూదన్ రెడ్డి, రాజసాగర్, గోపాల్, ఖాదీరుల్ల హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియ చేసారు.

## మహానంది క్షేత్రంలో దసరా శరన్నవరాత్రులకు మార్కెట్ ప్రసాద్ కు ఆహ్వానం



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 28- మహానంది క్షేత్రంలో శుక్రవారం స్థానిక అలంకారమండపంలో ఉత్సవాల ఆహ్వాన పత్రికలకు పూజలు నిర్వహించి విడుదల చేశారు. అనంతరం శనివారం నాడు దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి మదు మరియు వేదపండితులు రవిశంకర్ అవధాని గారి ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలో ఉన్న మహానందీశ్వరునికి నిత్యం కూరగాయల వితరణ చేస్తున్న నంద్యాల మార్కెట్ ప్రసాద్ కుటుంబ సభ్యులకు ఆహ్వాన పత్రికను అందజేశారు. వారు మాట్లాడుతూ అక్టోబర్ 3 నుంచి12వ తేదీ వరకు దసరా నవరాత్రి ఉత్సవాలనునిర్వహించనున్నా మన్నారు. ప్రతి రోజూ అమ్మవారికి అలంకారాలు, గ్రామోత్సవాలు, శతచండీయాగాలు, కలశార్చనలు, శ్రీ చక్రార్చన పూజలునిర్వహిస్తా మన్నారు. తప్పకుండా రావాలని కోరారు.

# ప్రభుత్వ పరిహారం.. బ్యాంకుల పాలు

విజయవాడ, సెప్టెంబర్ 28, బుడమేరు వరదల్లో సర్వం కోల్పోయిన బాధితుల్ని ఆదుకోడానికి రాష్ట్ర ప్రభుత్వం పరిహారాన్ని ప్రకటిస్తే అది కాస్త బ్యాంకుల పాలవుతోంది. గత రెండ్రోజులుగా ఏపీ ప్రభుత్వం ఆధార్ కార్డుతో లింకైన బ్యాంకు ఖాతాలకు పరిహారాన్ని చెల్లిస్తోంది. ఈ క్రమంలో కొందరు వరద బాధితుల పరిహారాన్ని బ్యాంకులు తమ పాత బాకీల్లో జమ చేసుకుంటున్నాయి. మైనస్ అకౌంట్లలోఉన్న నగదును బ్యాంకులు మళ్లించుకుంటుండంతో బాధితులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. వరద బాధితుల నష్టం గణించినపుడు ఇచ్చిన బ్యాంకు అకౌంట్ ఒకటైతే ఆ ఇంట్లో ఎవరి అకౌంట్లో మైనస్ ఖాతా ఉంటే ఆ ఖాతాలకు నగదు బదిలీ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీంట్లో బాధితులు లబోదిబోమంటున్నారు. కుటుంబంలో డిబిటి మ్యాపింగ్ ఉన్న ఖాతాలకు పరిహారం జమ చేస్తున్నట్టు బ్యాంకులు చెబుతున్నాయి. కొందరికి ఇనాక్టివ్ ఖాతాలు, ఆధార్ కేవైసీ కానీ ఖాతాలకు కూడా పరిహారం జమైన ఉదంతాలు వెలుగు చూశాయి. బుడమేరు వరదల్లో ముంపుకు గురైన బాధితులకు పరిహారాన్ని ఏపీ ప్రభుత్వం చెల్లించింది. ఈ క్రమంలో పలు జాతీయ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులు ఈ మొత్తాన్ని పాతబకాయిలు, మైనస్ అకౌంట్లలో జమ చేసుకుంటున్నాయి. బుధవారం నుంచి నగదు చెల్లింపులు మొదలు కావడంతో లబ్దిదారులు బ్యాంకులకు క్యూ కడుతున్నారు. ఈ క్రమంలో ఆ ఖాతాల్లో నగదు పడినా వెంటనే బ్యాంకులకు ఆటోమెటిక్ డెబిట్ కావడంతో తామేమి చేయలేమని సిబ్బంది చేతులెత్తేస్తున్నారు.సర్వం కోల్పోయిన బాధితులకు పరిహారం అందకుండా బ్యాంకులు చేయడంపై బాధితులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. నగదు రాకపోవడంతో బ్యాంకుల వద్ద బాధితులు ఉసురుమంటూ వెనుదిరుగుతున్నారు.ఆధార్ బేస్డ్ పేమెంట్స్ పద్ధతిలో ప్రత్యక్ష నగదు బదిలీ పద్ధతిలో పరిహారాన్ని ఏపీ ప్రభుత్వం చెల్లించింది. పరిహారం నగదు విషయంలో బ్యాంకులకు సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో ఈ సమస్యలు తలెత్తాయి. కెనరా బ్యాంకు ఖాతాదారులకు ఈ సమస్యలు ఎక్కువగా ఎదురైనట్టు బాధితులు ఆరోపిస్తున్నారు.బుడమేరు వరద బాధితులకు పరిహారం చెల్లింపు కొనసాగుతోంది. గురువారం సాయంత్రానికి దాదాపు 536.28కోట్ల రూపాయల పరిహారాన్ని ముంపు బాధితుల ఖాతాలకు ఆధార్ బేస్డ్ చెల్లింపుల ద్వారా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో చేపట్టారు. గురువారం సాయంత్రానికి మొత్తం 3,71, 302మందికి పరిహారం చెల్లింపుకు ఏర్పాట్లు చేసినట్టు రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా హిందుస్తాన్ టైమ్స్‌కు తెలిపారు.మరో రూ.10.69కోట్ల రుపాయల చెల్లింపులు సాంకేతిక కారణాలతో నిలిచిపోయాయన్నారు. 16668మంది బాధితులకు టెక్నికల్ ఇష్యూస్ వల్ల పరిహారం చెల్లింపు జరక బ్యాంకు ఖాతాలకు తిరిగి వచ్చాయని వివరించారు. మొత్తం 3,54,634మంది బాధితులకు రూ. 525.59కోట్ల రుపాయల్ని వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. మిగిలిన వారికి కూడా చెల్లింపులు కొనసాగుతాయని వివరించారు.నగరంలోని వివిధ దశల్లో చేపట్టిన వరద నష్టం గణనలో పలు కుటుంబాలు తమకు పరిహారం అవసరం లేదని పేర్కొన్నాయి. ఇలాంటి కుటుంబాలు దాదాపు 80వేల వరకు ఉండొచ్చని సిఎంఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి. వరదల్లో ప్రధానంగా ఒక అంతస్తులోపు మాత్రమే నివాసాలు ఉన్న వారికి ఎక్కువ నష్టం వాటిల్లింది. రెండో అంతస్తు ఉన్న వారికి వరద ముంపుకు గురి కాలేదు. మొదటి అంతస్తులోపు ఉన్న వారికి రూ.25వేలు, మొదటి అంతస్తు ఆపై ఉన్న వారికి రూ.10వేల పరిహారం ప్రభుత్వం ప్రకటించింది. ద్విచక్ర వాహనానికి రూ.3వేలు, ఆటోకు రూ.10వేలు చెల్లించారు. దుకాణాలు, పశువులు, కోళ్లు ఇలా అన్నింటికి లెక్క కట్టి పరిహారం చెల్లించారు. వరద నష్టం గణనలో పలు కుటుంబాలు తమకు ఎలాంటి నష్టం జరగలేదని, పరిహారం అవసరం లేదని పేర్కొనడాన్ని అధికారులు గుర్తించారు. ఇలాంటి కుటుంబాలు 80వేల వరకు ఉండొచ్చని, వరద నష్టం చెల్లింపు పూర్తైన తర్వాత పూర్తి వివరాలను వెల్లడించనున్నారు.రుణాలు కింద జమవద్దు= కలెక్టర్‌లబ్ధిదారులు బ్యాంకుల నుంచి ఇప్పటికే ఏవిధమైన రుణాలునైనా తీసుకొని ఉంటే జమచేసిన ఆర్థిక సహాయాన్ని రుణం కింద జమచేసుకోవద్దని సూచించారు. సర్వం కోల్పోయి ఎన్నో ఆర్థిక మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులను మానవతా దృక్పథంతో ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ విషయంలో బ్యాంకుల భాగస్వామ్యం అవసరమన్నారు. జమచేసిన సొమ్ము ఆటోమేటిక్‌గా రుణ తిరిగి చెల్లింపు కింద కట్ అయినట్లు గుర్తిస్తే ఆయా బ్యాంకు అధికారులు లబ్ధిదారులకు సమాచారమందించాలన్నారు. తిరిగి వారికి నగదు రూపంలో ఆర్థిక సహకారాన్ని అందించి వారు ఇబ్బందుల నుంచి బయటపడేయడంలో సహకరించాలని కలెక్టర్ సృజన బ్యాంకు అధికారులకు సూచించారు. దీనిపై కలెక్టర్ సూచనలను పరిగణనలోకి తీసుకొని తప్పనిసరిగా ఆర్థిక సహాయం బాధితులకు అందేలా చర్యలు తీసుకుంటామని బ్యాంకర్లు చెప్పారు. లబ్ధిదారులకు సహకరించడంలో బ్యాంకర్లు ముందుంటామని తెలిపారు

# టీటీడీకి పలాస జీడిపప్పు...

శ్రీకాకుళం, సెప్టెంబర్ 28, రాష్ట్రంలో ఒకపక్క శ్రీవారి మహా ప్రసాదం తిరుపతి లడ్డూపై వివాదం జరుగుతోంది. మరోవైపు తిరుపతి లడ్డూ తయారీ నిర్విరామంగా జరుగుతోంది. ఈ క్రమంలో లడ్డూ తయారీలో వినియోగించే జీడిపప్పును పలాస నుంచి తరలిస్తున్నారు. తిరుమలలో స్వామి వారిని దర్శించుకునే భక్తులు శ్రీవారి లడ్డూ మహా ప్రసాదంగా భావిస్తారు. తిరుమల వచ్చిన శ్రీవారి దర్శనం చేసుకున్న భక్తులు లడ్డూ ప్రసాదాన్ని తీసుకుంటారు. తమ వారి కోసం దానిని తీసుకెళు తుంటారు.టీటీడీ వేసిన బిడ్ శ్రీకాకుళం జిల్లాలోని పలాసకు చెందిన ఎస్ఎస్ఎస్ ఆగ్రో ప్రోడక్ట్స్ దక్కించుకుంది. స్వామి వారి దయ వల్లే ఈ బిడ్ తమకు దక్కిందని ఎస్ఎస్ఎస్ ఆగ్రో ప్రోడక్ట్స్ అధినేత సంతోష్‌కుమార్ తెలిపారు.శ్రీవారి లడ్డూ తయారీకి 30 టన్నుల జీడిపప్పును ఎస్ఎస్ఎస్ ఆగ్రో ప్రోడక్ట్స్ బుధవారం పంపింది. దీంతో 50 ఏళ్ల తరువాత మళ్లీ తొలిసారి పలాస నుంచి శ్రీవారి లడ్డుకి జీడిపప్పు పంపుతున్నారు.పలాస నుంచి తిరుమల వెళ్లే 30 టన్నుల జీడిపప్పు వాహనానికి మంత్రులు అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు, పలాస శాసనసభ్యులు గౌతు శిరీష ప్రత్యేక పూజలు చేసి జెండా ఊపి ప్రారంభించారు.ఈ పవిత్ర తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదం తయారీ కోసం ఇక నుంచి నాణ్యమైన జీడిపప్పు పలాస నుంచి వెళ్తుందని రాష్ట్ర పశువర్ధక శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు అన్నారు. వైసీపీ ఐదేళ్ల అక్రమ పాలనలో నాణ్యత లేని జీడిపప్పు వినియోగించారని పేర్కొన్నారు.తిరుమల తిరుపతి దేవస్థానంలో నాణ్యమైన, రుచికరమైన లడ్డూ తయారీకి అనుగుణంగా పలాస ప్రాంతం నుంచి సరఫరా చేయనున్న జీడిపప్పు వాహనాలను జెండా ఊపి ప్రారంభించడం జరిగిందని, మా ప్రాంతం జీడిపప్పు తిరుమల ప్రసాదంలో వాడడంపై ఆ ప్రాంత వాసిగా ఎంతో గర్వపడుతున్నానని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు అన్నారు.

# అంతుచిక్కని జనసేనాని వ్యూహం...

గుంటూరు, సెప్టెంబర్ 28, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎన్నికలకు ముందు తరహాలోనే మళ్లీ ఆవేశంతో ఉన్నారు. ఎన్నికల సమయంలో ఒకింత నాటి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పవన్ కల్యాణ్ ప్రతి సభలో శపథం చేశారు. జగన్ ను అథ:పాతాళానికి తొక్కేస్తానని ప్రకటించి సంచలనమే సృష్టించారు. అలాగే జగన్ ప్రభుత్వాన్ని కూల్చివేస్తానని ప్రతిన బూనారు. అన్నట్లుగానే కూటమిని ఏర్పాటు చేయడంలో పవన్ కల్యాణ్ కీలకంగా వ్యవహరించారు. నిజానికి పవన్ కల్యాణ్ లేకుంటే కూటమి ఏర్పాటు సాధ్యమయ్యేది కాదు. పవన్ వల్లనే కూటమి అధికారంలోకి వచ్చిందని చెప్పడానికి ఎటువంటి సందేహం లేదు. దీనికి తోడు కాపు + కమ్మ క్యాస్ట్ ఈక్వేషన్ కూడా బలంగా పనిచేసింది. చంద్రబాబును జైల్లో వేసిన సానుభూతి కూడా కొంత పనిచేసింది పవన్ కల్యాణ్ అనుకున్నట్లుగానే కూటమి అధికారంలోకి వచ్చింది. వంద రోజుల పాలన పూర్తయింది. వంద రోజుల్లో పవన్ అసలు రాజకీయాల జోలికి రాలేదు. ఆయన తనకు అప్పగించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై దృష్టి పెట్టారు. తొలిసారిగా ఉపముఖ్యమంత్రిగా కూడా కావడంతో పవన్ కల్యాణ్ తనకు అప్పగించిన శాఖలపై కూలకషంగా అధ్యయనం చేయడానికి సమయాన్ని ఎక్కువ సేపు వెచ్చించారు. మిగిలిన పనులన్నీ పక్కన పెట్టి గ్రామాభివృద్ధిపైనే పవన్ కల్యాణ? మూడు నెలల పాటు ఫోకస్ పెట్టారు. దీంతో తనకు అప్పగించిన శాఖలపై పవన్ కల్యాణ్ కు కొంత వరకూ గ్రిప్ దొరికినట్లయింది. అయితే వందరోజుల పాలన ముగిసిన తర్వాత పవన్ కల్యాణ్ తిరుమల లడ్డూ వివాదంలో ఆగ్రహంతో ఊగిపోయారు. తిరిగి ఎన్నికల నాటి పవన్ కల్యాణ్ అందరికీ కనిపించారు. సనాతన ధర్మంపై ఎక్కువగా మాట్లాడారు. హిందువులంతా ఏకంకండి..తిరుమల లడ్డూ వివాదంలో అందరూ రోడ్డుపైకి రావాలని పిలుపునిచ్చారు. తిరుమల లడ్డూపై కామెంట్స్ చేసిన వారిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. టాలీవుడ్ నుంచి రాజకీయ నేతల వరకూ గట్టి వార్నింగ్ ఇచ్చారు. అందరికీ తాట తీస్తానంటూ హెచ్చరించారు. దీనికితోడు తిరుమలలో అపవిత్రం జరిగిందని ప్రాయశ్చిత్త దీక్షకు దిగారు. వచ్చే నెల 1వ తేదీన తిరుమలకు వెళ్లి దీక్షను విరమించనున్నారు. అయితే తాజాగా జగన్ తిరుమల పర్యటనను అడ్డుకోవద్దని జనసేనాని పిలుపు నివ్వడం వెనక టీడీపీ నేతలు ఉన్నారంటున్నారు. కానీ పవన్ కల్యాణ్ పూర్తిగా హిందూ ధర్మాన్ని భుజనికెత్తుకోవడం కూటమిలోని బీజేపీకి కొంత బాగానే ఉన్నప్పటికీ, టీడీపీ మాత్రం ఇరకాటంలో పడినట్లయింది. మిగిలిన వర్గాలు కూటమికి దూరమవుతాయన్న అభిప్రాయం టీడీపీలో వ్యక్తమవుతుంది. అయితే పవన్‌ను అభ్యంతరం పెట్టే సాహసం టీడీపీనేతలు ఎవరూ చేయలేరు. అందుకు కారణం.. చంద్రబాబు,పవన్‌ల మధ్య బంధం బలమైనదిగా మారడంతో పవన్ కల్యాణ్ కు వ్యతిరేకంగా మాట్లాడేందుకు ఎవరూ ముందుకు రాలేదు. అయితే పార్టీలో మాత్రం పవన్ కల్యాణ్ ఆవేశపూరిత ప్రకటనలపై మాత్రం చర్చ బాగానే జరుగుతుందని తెలిసింది. ప్రధానంగా మైనారిటీలు, దళితులు తమకు దూరమవుతారేమోనన్న ఆందోళనను టీడీపీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. అయితే పవన్ ను కంట్రోల్ చేయలేరెవరు. అది అందరికీ తెలిసిందే. పవన్ రానున్న కాలంలో ఎలాంటి రకమైన కామెంట్స్ చేసి కూటమిని ఇరుకున పెడతారేమోనన్న భయం సైకిల్ పార్టీ నేతలకు పట్టుకుంది. మరి పవన్ ఏం చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

-

# రాజ్యసభ రేసులో ఎవరు...

విజయవాడ, సెప్టెంబర్ 28, ఆంధ్రప్రదేశ్ లో మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ అయ్యాయి. వైసీపీకి చెందిన ముగ్గురు రాజ్యసభ సభ్యులు రాజీనామా చేయడంతో త్వరలోనే ఎన్నికలు జరగనున్నాయి. అయితే ఈ మూడుస్థానాలు కూటమి ఖాతాలోకే పడతాయి. అందులో ఎలాంటి సందేహం లేదు. ఎమ్మెల్యేల బలం కూటమికి పుష్కలంగా ఉంది. వైసీపీకి 11 మంది సభ్యులు మాత్రమే ఉండటంతో అది పోటీ చేసే పరిస్థితి కూడా లేదు. 164 మంది శాసనసభ్యులున్న మూడు రాజ్యసభ స్థానాలను కూటమి కైవసం చేసుకోవడం ఖాయంగా కనిపిస్తుంది. అందిన సమాచారం మేరకు ఇప్పటికే చంద్రబాబు నాయుడు ఈ పదవుల పంపకంపై ఒక క్లారిటీకి వచ్చినట్లు పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. మూడింటిలో ఒకటి జనసేనకు ఇచ్చి, మిగిలిన రెండు స్థానాలను టీడీపీ తీసుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ రాజ్యసభ పదవుల్లో బీజేపీకి మాత్రం రిక్త హస్తం చూపుతున్నారని తెలిసింది. ఇటీవల ఇరవై నామినేటెడ్ పోస్టులు ప్రకటిస్తే అందులో పదహారు టీడీపీ తీసుకోగా, మూడు జనసేనకు ఇచ్చింది. ఒకటి మాత్రమే బీజేపీకి ఇచ్చింది. నామినేటెడ్ పోస్టుల విషయంలోనే కొంత ఆచితూచి వ్యవహరించిన చంద్రబాబు రాజ్యసభ స్థానాల విషయంలో రాజీపడబోరని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ కేంద్ర నాయకత్వాన్ని ఒప్పించి తమకు రాజ్యసభలో ప్రాతినిధ్యం లేనందున టీడీపీ, జనసేన పార్టీలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది.అయితే ఇందులో రెండింటిలో ఒకటి గల్లా జయదేవ్ కు ఇస్తారని చెబుతున్నారు. గల్లా కుటుంబంతో ఉన్న అనుబంధంతో పాటు ఢిల్లీలో గల్లా జయదేవ్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆయనకు రాజ్యసభ పదవిని ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. గల్లా జయదేవ్‌ను ఢిల్లీలో ఉంచి రాష్ట్రానికి రావాల్సిన అన్ని ప్రయోజనాల విషయంలో అధికారులను, కేంద్రమంత్రులను తరచూ కలిసే బాధ్యతలను కూడా అప్పగిస్తారని అనుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే గల్లా జయదేవ్ పేరు ఖరారయిందని, ఆయన పేరు ఇక ప్రకటించడమేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గల్లా జయదేవ్ తో పాటు మరో సీనియర్ నేత అశోక్ గజపతి రాజు పేరు కూడా బలంగా వినిపిస్తుంది. క్షత్రియ సామాజికవర్గానికి రాజ్యసభ పదవి ఇవ్వకపోవడంతో ఆ సామాజికవర్గం కొంత అసంతృప్తితో ఉందని భావించిన చంద్రబాబు అశోక్ గజపతిరాజును పెద్దలసభకు పంపుతారని తెలుస్తోంది. ఆయన పేరు కూడా దాదాపు ఖరారయిందని పార్టీలో అత్యంత సీనియర్ నేత ఒకరు చెప్పడం విశేషం. అందుకే అశోక్ గజపతి రాజు ఈ పదవి కోసమే ఎదురు చూస్తున్నారని అంటున్నారు. మరొక వైపు జనసేన నుంచి రాజ్యసభ అభ్యర్థిగా పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబు పేరు ఖరారయినట్లు తెలిసింది. నాగబాబు పేరును చంద్రబాబుకు పవన్ ప్రతిపాదించినట్లు అందిన సమాచారం ప్రకారం తెలుస్తోంది. దీంతో మూడు రాజ్యసభ స్థానాలకు దాదాపు అభ్యర్థులు ఖరారయినట్లేనని, నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ప్రకటన ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# ఏనుగుల సమస్యకు ఫుల్ స్టాప్...

తిరుపతి, సెప్టెంబర్ 28, ఏపీ - కర్ణాటక రాష్ట్రాల మధ్య కుంకీ ఏనుగుల అంశంపై శుక్రవారం కీలక ఒప్పందం జరిగింది. కర్ణాటక నుంచి 8 ఏనుగులను ఏపీకి పంపేలా ఇరు రాష్ట్రాల అటవీ అధికారులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కర్ణాటక మంత్రి ఈశ్వర్ ఖండ్రే సమక్షంలో ఈ కీలక ఒప్పందం జరిగింది. కాగా, చిత్తూరు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లోని జనావాసాల్లోకి ఏనుగుల సంచారంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవల బెంగుళూరు వెళ్లిన పవన్.. కర్ణాటక మంత్రి, అక్కడి అటవీ అధికారులతో మాట్లాడి కుంకీ ఏనుగులను పంపాలని ప్రతిపాదించగా అందుకు వారు సానుకూలంగా స్పందించారు. 'ఏనుగులు పంట పొలాలు ధ్వంసం చెయ్యడం నా దృష్టికి వచ్చింది. డిప్యూటీ సీఎం గా బాధ్యతలు తీసుకోగానే ఈ సమస్యను ఏ విధంగా పరిష్కరించాలని అధికారులతో సమీక్షించా.ఈ క్రమంలోనే కుంకీ ఏనుగులు తేవాలని నిర్ణయించాం.కర్ణాటక సీఎం, అటవీ శాఖ మంత్రిని కలిసి సమస్యను చెప్పిన వెంటనే వారు సానుకూలంగా స్పందించారు. ఇరు ప్రభుత్వాలు 6 అంశాలు మీద నిర్ణయం తీసుకున్నాం. దసరా తరువాత కుంకి ఏనుగులను ఇక్కడికు తరలిస్తారు.' అని పవన్ తెలిపారు.ఏపీలో ప్రస్తుతం 23 శాతం అటవీ ప్రాంతం ఉందని.. ఇది 50 శాతానికి పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పవన్ కల్యాణ్ తెలిపారు. ప్రస్తుతం అటవీ శాఖ క్యాంపులో ఉన్న ఏనుగులు వయసు మీరిన కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. అందుకే కుంకీ ఏనుగులు పంపాలని కర్ణాటకను కోరామన్నారు. వీటి ద్వారా చిత్తూరు, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాల్లో ఏనుగుల దాడుల సమస్యను అరికట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు.'

# జనసేన గూటికి బొత్స లక్ష్మణరావు...?

విజయనగరం, సెప్టెంబర్ 28, వలస రాజకీయంలో ఇదో పెద్ద ట్విస్టు.. మరీ ముఖ్యంగా ఉత్తరాంధ్ర రాజకీయాల్లో ఊహించని మార్పు. రాష్ట్ర రాజకీయాలను శాసించిన ఉత్తరాంధ్ర నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబం నుంచి ఓ కీలక నేత జనసేనలో చేరనున్నాడనే సమాచారం ఆసక్తికరంగా మారింది. ఇన్నాళ్లు కుటుంబమే బొత్సకు బలం అనుకుంటుండగా, ఆ కుటుంబం నుంచి ఒకరు బొత్సను ధిక్కరించి రాజకీయంగా విభేదించి జనసేనలో చేరతానని ప్రకటించడం పొలిటికల్‌గా హీట్ పుట్టిస్తోంది. అంతేకాదు అసెంబ్లీ ఎన్నికల్లో బొత్స కుటుంబ సభ్యుల్లో ఒకరిని ఓడించేలా ఆయన సొంత సోదరుడే పావులు కదిపాడనే ప్రచారం కూడా కాక రేపుతోంది. ఈ పరిస్థితుల్లో ఇన్నాళ్లు ఊహాగానమే అనుకున్నా.. బొత్స ఫ్యామిలీ వార్ నిజమని తేలిపోయిందని అంటున్నారు.ఉత్తరాంధ్ర లీడర్లలో బొత్సకు ఎదురులేదని చెబుతుంటారు. గత ఎన్నికల్లో ఓడినా అధిష్టానం వద్ద పరపతితో గత నెలలో జరిగిన విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఎమ్మెల్సీగా పోటీ చేసి ఏకగ్రీవంగా గెలుపొందారు. ఇక అదనపు బోనాంజాగా మండలిలో ప్రతిపక్ష నేత పోస్టును కొట్టేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ చీఫ్‌గా పనిచేసిన బొత్స?. ఒకానొక సమయంలో ముఖ్యమంత్రి రేసులో ఉన్నాననే సంకేతాలిచ్చారు. ఇలా సాధారణ కార్యకర్త నుంచి కీలక నేతగా ఎదిగిన బొత్సకు కుటుంబమే పెద్ద బలం. దాదాపు మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న బొత్సకు ఆయన కుటుంబ సభ్యుల అండదండలు పుష్కలంగా ఉండేవి.దాదాపు పది మంది వరకు బొత్స సోదరులు, సోదరీమణులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా ప్రభావం చూపుతుంటారు. చుట్టాలు, బంధువులుతో జిల్లా వ్యాప్తంగా బొత్సకు బంధుగణం ఉంటుంది. అందుకే ఆయన స్ట్రాంగ్ లీడర్‌గా ఎదిగారు. సొంత సోదరులు, సోదరీమణులతోపాటు దూరపు బంధువులు కూడా బొత్సకు వ్యతిరేకంగా నడిచే పరిస్థితి ఇంతవరకు ఎదురుకాలేదు. కానీ, తొలిసారిగా ఆయన సొంత సోదరుడే ధిక్కార స్వరం వినిపించడం చర్చనీయాంశంగా మారిందంటున్నారు.సీనియర్ నేత బొత్సకు మూడో సోదరుడైన లక్ష్మణరావు చాలా కాలంగా రాజకీయాల్లోకి ప్రవేశించాలని ఉబలాట పడేవారని చెబుతారు. అయితే బొత్స, ఆయన భార్య ఝాన్సీలక్ష్మి, బొత్స సోదరుడు అప్పలనరసయ్య, వరసకు సోదరుడైన నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించి లక్ష్మణరావుకు అవకాశం లేకుండా చేశారంటారు. కానీ, ఆయన ఎప్పుడూ అలాంటి అసంతృప్తికి లోనుకాకుండా అన్న చెప్పిన విధంగా నడుచుకునే వారంటారు. కానీ, రాజకీయంగా ఎదగాలనే ఆశ మాత్రం తీరని కోరికగా మిగిలిపోవడంతో గత ప్రభుత్వంలో తెర వెనుక నుంచి తెరపైకి రావాలని ప్రయత్నించారని అంటారు.ఈ క్రమంలోనే నెల్లిమర్ల నియోజకవర్గంపై ఫోకస్ చేసిన లక్ష్మణరావు? తన కంటూ ప్రత్యేక వర్గాన్ని తయారు చేసుకున్నట్లు చెబుతున్నారు. ఐతే ఇప్పటికే బొత్స కుటుంబంలో నలుగురైదుగురు ఎమ్మెల్యే, ఎంపీలుగా పనిచేయడంతో లక్ష్మణరావుకి వైసీపీలో చాన్స్ ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదనే టాక్ ఉంది. ఇక నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడితోనూ బొత్స లక్ష్మణరావుకి గ్యాప్ ఉందంటున్నారు. ఈ ఇద్దరి పంచాయితీని బొత్స కూడా పరిష్కరించకపోవడంతో గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి అయిన కుటుంబ సభ్యుడు అప్పలనాయుడిని ఓడించేలా బొత్స లక్ష్మణరావు పనిచేశారని చెప్పుకొంటున్నారు.ఎన్నికల్లో వైసీపీకి పనిచేయలేదనే ప్రచారం జరుగుతున్న సమయంలోనే లక్ష్మణరావు జనసేనలో చేరనున్నట్లు ప్రకటన చేయడంతో ఇన్నాళ్లు జరిగిన ప్రచారం నిజమని తేలిపోయిందని అంటున్నారు

తనకు అవకాశం ఇచ్చే విషయంలో అన్న నుంచి స్పష్టమైన హామీ లభించకపోవడంతో ఇన్నాళ్లు తెరచాటుగా జనసేనతో కలిసి పనిచేసిన లక్ష్మణరావు.. అధికారికంగా జనసేన కండువా కప్పుకోవాలని డిసైడ్ అయ్యారంటున్నారు. దీంతో ఉత్తరాంధ్ర రాజకీయాల్లో చక్రం తిప్పుతున్న బొత్సకు ఈ పరిణామంతో షాక్ తగిలినట్లైంది. వాస్తవానికి బొత్స కుటుంబంలో అంతా ఒక్కటిగా కనిపించినా, బొత్స మేనల్లుడు, విజయనగరం జడ్పీ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాస్ అలియాస్ చిన్నశ్రీనుతో కుటుంబానికి గ్యాప్ ఉందనే ప్రచారం ఉంది. ఐతే అది ఆ కుటుంబ వ్యవహారం కావడంతో ఎవరూ పెద్దగా దృష్టి పెట్టలేదు.కానీ, ఇప్పుడు లక్ష్మణరావు అన్నతో విభేదించి జనసేనకు వచ్చేయాలని నిర్ణయం తీసుకోవడంతో బొత్స ఫ్యామిలీలో ఏం జరుగుతుందనే చర్చ మొదలైంది. ఇక నుంచి బొత్స వైసీపీలో, ఆయన సోదరుడు జనసేనలో కొనసాగి ప్రత్యక్ష యుద్ధానికి సిద్ధపడతారా? అనే ఉత్కంఠ ఏర్పడుతోంది. ఐతే బొత్స కుటుంబంలో నుంచి ఒకరు బయటకు వచ్చారంటే? అందులో ఇంకేదో దాగుందని.. ఇది భవిష్యత్ రాజకీయ మార్పులకు సంకేతం కావచ్చేనే అనుమానం కూడా వ్యక్తమవుతోంది. ఏదిఏమైనా బొత్స ఫ్యామిలీ వార్ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. ఈ మార్పు ఒక్క బొత్స లక్ష్మణరావు వరకే పరిమితం అవుతుందా? లేక బొత్స ఫ్యామిలీ నుంచి మరికొందరు బయటకు వస్తారా? అనేదే చూడాల్సివుంది.

జనసేన పార్టీ
JANASENA PARTY


# మున్సిపల్ కమిషనర్ ని కలిసిన డిసిసి అధ్యక్షులు పి మురళీకృష్ణ



విభారే న్యూస్. సెప్టెంబర్ 28. కర్నూలు ప్రతినిధి శనివారం మధ్యాహ్నం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పి మురళీకృష్ణ కర్నూల్ నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు ని కలిసి కర్నూల్ నగరము నందలి సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా కర్నూలు నగరములో ఉన్న అన్ని పార్కులు శుభ్రం చేయించి, పార్కుల్లో చిన్నపిల్లలు ఆడుకొవడానికి ఆట వస్తువులు, పెద్దలకు అవేర్నెస్ ప్రోగ్రాములు, వాకింగ్ ట్రాకులు, పార్కులకు వాచ్మెన్లను నియమించి వృద్ధులు రోడ్లమీద వాకింగ్ చేయకుండా వారికి ప్రత్యేక ప్లాట్ ఫామ్ లు ఏర్పాటు చేయవలసిందిగా మురళీకృష్ణ కోరారు. అలాగే కర్నూల్ నగర పరిధి నందలి ప్రభుత్వ స్థలాలలో హద్దులకు ఫెన్సింగ్ తీగలు లేదా కాంపౌండ్ గోడలు నిర్మించి ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలని, కర్నూలు కార్పొరేషన్ పరిదినందు గల వెంకటరమణ కాలనీ ప్రేమనగర్ కాలనీ రోడ్ నెంబర్ 3 మరియు 4 లైన్ల నందు క్లీనింగ్, వీధిలైట్లు మరియు చెట్లను నాటించి వాటికి క్రమం తప్పకుండా ఉద్యానవన శాఖ వారిచే ఆ చెట్లను సమగ్రంగా పరిరక్షించవలెనని మురళీకృష్ణ కమిషనర్ రవీంద్ర బాబు ని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనంతరత్నం ఈ లాజరస్ ఎస్ ప్రమీల ఏ వెంకట సుజాత కరుణమ్మ మొదలగు వారు పాల్గొన్నారు.


# ఆళ్లగడ్డలో ఉచిత రేబిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం

## పెంపుడు కుక్కలను పెంచే ప్రతి ఒక్కరూ రేబిస్ టీకా వేయించాలి..



ఆళ్లగడ్డ పశుసంవర్ధక శాఖ డిడి రమణయ్యవిభారె న్యూస్ ఆళ్లగడ్డ సెప్టెంబర్ 28 :– ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ పశు వైద్యశాల ఆవరణలో శనివారం ప్రపంచ రేబిస్ దినోత్సవం ఉచిత రేబిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పశుసంవర్ధక శాఖ ఆళ్లగడ్డ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య, ఏడి .కొండారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సందర్భంగా కుక్క కరచినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి పశుసంవర్ధక శాఖ అధికారులు వివరించారు. పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య అధ్యక్షతన అసిస్టెంట్ డైరెక్టర్ కొండారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు మాట్లాడుతూ కుక్క కరిచినప్పుడు వెంటనే కరచిన ప్రదేశాన్ని సబ్బు నీటితో కడగాలన్నారు. కరచిన పై భాగంలో విషము పైకి ఎక్కకుండా తాడుతో గట్టిగా కట్టడం వల్ల తీవ్రతను కొంతవరకు తగ్గించ వచ్చున్నారు. వెంటనే సమీపంలోని న్యూరో సంబంధిత డాక్టర్ను సంప్రదించి టీ.టీ ఇంజక్షన్లను వేయించుకోవడంతోపాటు మందులను వాడవలసి ఉంటుందన్నారు. అలాగే యాంటీ రే బిస్ ఇంజక్షన్లను ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వేయించుకొని చికిత్స పొందాలని సూచించారు. పెంపుడు కుక్కలకు ఏవైనా పిచ్చి కుక్కలు కరిచినప్పుడు వాటికి కూడా వ్యాక్సిన్ ను వేయించవలసి ఉంటుందని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య వివరించారు. వ్యాక్సిన్ ఇచ్చే ముందు ఆయా జంతువులలో పది రోజులు నిజముగా రేబిస్ అయిందో లేదో పరిశీలనలో ఉంచాలి. రే బిస్ను పిచ్చికుక్క వ్యాధి లేదా జలభితి వ్యాధి హైడ్రోఫోబియా అని కూడా అంటారు ఇది క్షీరదాలకు చెందిన జంతువుల నుండి జంతువులకు వ్యాపించే ఒక వైరల్ వ్యాధి ఉదాహరణకు కుక్కలు తదితర మాంసాహార జంతువులు జరుగుతూ ఉన్న జంతువు కరిచినచో ఈ వ్యాధి మనుషులకు వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ పశుసంవర్ధక శాఖ సిబ్బంది నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# మాకు పదవుల కంటే - ప్రజలు ముఖ్యం: నాగిని రవి సింగారెడ్డి




–విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 28– మాకు పదవుల కంటే ప్రజల శ్రేయస్సు కోసమే పనిచేస్తామని నంద్యాల కౌన్సిలర్ నాగిని రవి సింగారెడ్డి పేర్కొన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని శిల్పా సేవా సమితి నందు 200 మంది మహిళలకు దాదాపు 30 లక్షల రుణాలను బ్యాంక్ చైర్ పర్సన్ నాగిని రవి సింగారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. గెలిచినా ఓడిన శిల్పా సేవాసమితి కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆమె అన్నారు. ఈ సందర్భంగా మహిళా బ్యాంక్ చైర్ పర్సన్ నాగిని రవి సింగారెడ్డి మాట్లాడుతూ ముందుగా నంద్యాల ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ నంద్యాల పట్టణంలోని 200 మంది మహిళలకు దాదాపు 30 లక్షల రూపాయలు అందజేయడం చాలా సంతోషకరంగా ఉందన్నారు అదేవిధంగా నంద్యాల నియోజకవర్గంలో గత 14 సంవత్సరాల నుండి శిల్పా మహిళా బ్యాంకును నిర్వహించడం జరుగుతుందని గెలిచినా ఓడిన రాజకీయాలకు కులమతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల ఆశీస్సులు పొందుతున్నామని అలాగే నంద్యాల నియోజకవర్గంలో ఏ రాజకీయ నాయకుడు చేయని విధంగా శిల్పా కుటుంబం సంపాదించిన దానిలో కొంతవరకు నంద్యాల ప్రజల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. చాలామంది ఎలక్షన్లు ఉన్నప్పుడు మాత్రమే సేవా కార్యక్రమాలు నిర్వహించి అయిపోయిన వెంటనే వాటిని ఆపివేయడం జరుగుతుందన్నారు. నంద్యాల ప్రజలకు శిల్పా సేవాసమితి ద్వారా సేవా కార్యక్రమాలు అందిస్తూనే ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం డైరెక్టర్ పూర్ణిమ మేనేజర్ హరిలీల, సేవాసమితి మేనేజర్ లక్ష్మీనారాయణ ,సహదేవుడు మహిళలు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు నాయకుడికి మంచి బుద్ధి ప్రసాదించు స్వామి: వైఎస్ఆర్సిపి నాయకులు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 28–ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి లడ్డు ప్రసాదం పై సీఎం చంద్రబాబు నాయుడు రాజకీయ దుర్బుద్ధితో లేవనెత్తినకొన్ని దుష్ప్రచారం ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉందని, ఇటువంటి అసత్యపు ప్రచారాలు ఇకనైనా సీఎం చంద్రబాబు నాయుడు మానుకోవాలని, ఆ అఖిలాండ బ్రహ్మాండ కోటి నాయకుడు శ్రీ వెంకటేశ్వర స్వామి మంచి బుద్ధిని ప్రసాదించాలని, ఇటువంటి రాజకీయ కుయుక్తులకు ఇకనైనా స్వస్తి పలకాలని నంద్యాల జిల్లా వైఎస్ఆర్సిపి నాయకులు కోరారు. వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధ్యక్షులు మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు నంద్యాల పట్టణం గుడిపాటి గడ్డలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నంద్యాల జిల్లా వైఎస్ఆర్సిపి నాయకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తిరుపతి లడ్డు ప్రసాదం పై సీఎం చంద్రబాబు నాయుడు చేసిన పాపాన్ని ప్రక్షాళనం చేయాలని ఆ దేవదేవుని వేడుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి నాయకులు మాట్లాడుతూ.. కోట్లాది ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతి లడ్డు ప్రసాదం పై నిరాధారమైనటువంటి ఆరోపణలు చేసి వైఎస్ఆర్ పార్టీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పై దుష్ప్రచారాలు చేస్తున్నారని, ఇది తగదన్నారు కోట్లాదిమంది మనోభావాలకు సంబంధించిన అంశాలను ప్రస్తావించేటప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడు పలుమార్లు వివేచనతో ఆలోచించి వెల్లడి చేయాలని హితవు పలికారు. చంద్రబాబు నాయుడుకు సద్బుద్ధి ప్రసాదించాలని, రాష్ట్రం బాగుండాలని, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాముఖ్యత, తిరుపతి లడ్డు విశిష్టత మరింత ముందుకు తీసుకువెళ్ళి భక్తుల్లో నమ్మకాన్ని, విశ్వాసాన్ని పెంపొందించేందుకు వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, వైఎస్ఆర్సిపి లీగల్ సెల్ ప్రతాప్ రెడ్డి రామసుబ్బయ్య, శరత్, కౌన్సిలర్స్ కృష్ణమోహన్,పున్న రాజేశ్వరి, మాజీ కౌన్సిలర్స్ లక్ష్మీనారాయణ ,పున్న శేషయ్య, కిరణ్ కుమార్, చింత శ్రీనివాసులు, రామ సుబ్బారెడ్డి, శివ నాగిరెడ్డి, దండే సుధాకర్, దండే శ్రీనివాసులు, రవికుమార్ రెడ్డి, శంకర్ నాయక్, కుమ్మరి రాముడు, సన్నాల సాయిరాం రెడ్డి, టివి రమణ, చింతకుంట్ల భాస్కర్ రెడ్డి, మరియు వైసీపీ నాయకులు పాల్గొన్నారు

# తెలుగు సాహితీ దిగ్గజం గుఱ్ఱం జాషువా..

## జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పి మురళీకృష్ణ..



విభారె న్యూస్ సెప్టెంబర్ 28 కర్నూలు జిల్లా ప్రతినిధి.. తెలుగు సాహితీ దిగ్గజం గుఱ్ఱం జాషువ అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పి మురళి కృష్ణ అభిప్రాయపడ్డారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గుర్రం జాషువా 129వ జయంతి,స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్ 117 వ జయంతి సందర్భంగా కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు పి మురళీకృష్ణ మాట్లాడుతూ వీరయ్య, లింగమ్మ దంపతులకు గుఱ్ఱం జాషువ 1895 సెప్టెంబర్ 28వ తేదీన గుంటూరు జిల్లా చాట్రగడ్డపాడు గ్రామంలో జన్మించారని,జాషువా తండ్రి పాస్టర్ గా పనిచేశాడని కుల వివక్ష కారణంగా తోటి విద్యార్థులతో అవమానాలు ఎదుర్కొన్నాడని, ఉపాధ్యాయుడిగా పని చేశాడని,రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ప్రచారకుడిగా పని చేశాడని,రేడియో కేంద్రంలో ప్రొడ్యూసర్ గా పని చేశారని,1964లో శాసనమండలిలో సభ్యత్వం పొందాడని జాషువా 36 గ్రంథాలు,ఎన్నో కవితా ఖండాలు రాశారని,కేంద్ర సాహితీ అకాడమీ పురస్కారం,కళా ప్రపూర్ణ, పద్మభూషణ్ పురస్కారాలు లభించాయని ఆయన తెలుగు భాషకు చేసిన సేవలు అమోఘమని జాషువా 1971 జూలై 24వ తేదీన మరణించారని ఆయన మరణం కవితా లోకానికి తీరని లోటని మురళీకృష్ణ అభిప్రాయపడ్డారు. అలాగే స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్ 1907 సెప్టెంబర్ 28న నేడు పాకిస్థాన్ లో ఉన్న లాహోర్ సమీపంలోని ఒక గ్రామంలో జన్మించారని 1930 మార్చి 23న భగత్ సింగ్ ను ఆయన సహచరులు సుఖదేవ్ రాజ్ గురులతో పాటు బ్రిటిష్ వలస ప్రభుత్వం ఉరితీసి హత్య చేసిందని ఆయనను ఉరి తీశారని తెలిసిన వెంటనే ఆ హిమాచలం అట్టుడికి పోయిందని లాహోర్కు ఎంతో దూరంలో ఉన్న మద్రాసులోనూ ప్రజలు కోపా వేషాలతో తమంతట తాముగా ఇళ్ల నుండి బయటకు వచ్చి నిరసన ప్రదర్శనలు చేశారని ఆ విప్లవకారుడు 23 ఏళ్ళే బతికిన తన రచనలతో తన ఆచరణతో త్యాగంతో ఎంతో వారసత్వ సంపదను భావితరాలకు అందించారని మురళీకృష్ణ అభిప్రాయపడ్డారు. ముందుగా పార్టీ నాయకులు కార్యకర్తలు గుఱ్ఱం జాషువా భగత్ సింగ్ చిత్రపటములకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు కాంగ్రెస్ నాయకులు దామోదరం రాధాకృష్ణ ఎన్ సి బజారన్న, కే వెంకటరెడ్డి, పోతుల శేఖర్, రియాజుద్దీన్, షేక్ ఖాజా హుస్సేన్, ఈ లాజరస్, సాయి కృష్ణ,ఎస్ ప్రమీల ఏ వెంకట సుజాత బి సుబ్రహ్మణ్యం పసుపుల ప్రతాపరెడ్డి ఎన్ సుంకన్న, వసిబాషా,రమేష్,అక్బర్, కేశవరెడ్డి,నడిపెన్న, సంజమ్మ మొదలగు వారు పాల్గొన్నారు.

## ఏడుకొండల స్వామి తో పెట్టుకున్నోడు

# ఎవడూ బాగుపడలేదు

## నాలుగు గోడల మధ్య బైబిల్ చదివే జగన్ తిరుమలను ఎలా గౌరవిస్తారు

## నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి



-- విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి సెప్టెంబర్ 28–ప్రపంచంలోని హిందువుల ఆరాధ్య దైవం తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి తో పట్టుకున్నోడు ఎవడూ బాగుపడలేదని, గత ఇదేళ్ళ వైసీపీ అధినేత జగన్ పాలనలో టీటీడీలో చేసిన ఘోర పాపాలే ఆయన మెడకు చుట్టుకున్నాయని, హిందువులే కాదు ముస్లింలు, ఇతర మతాల వారు కూడా తిరుపతి లడ్డును పవిత్రంగా భావించి తింటారని, నాలుగు గోడల మధ్య బైబిల్ చదివే జగన్ తిరుమలను ఎలా గౌరవిస్తారని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రశ్నించారు. శనివారం నందికొట్కూరు నియోజకవర్గం పాత ముచ్చుమర్రి గ్రామంలో నూతన అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపీ బైరెడ్డి శబరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను జగన్ పాలనలో చిన్నాభిన్నం అయ్యాయని, ఏకంగా తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను దెబ్బతీసి హిందువుల మనోభావాలను గాయపరిచారని, . నేరం చేసిన వారు శిక్షించబడాలని, టీటీడీతో పాటు రాష్ట్రంలోని హిందూ ఆలయాలను పరిరక్షించి, ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా, ఆలయాలపవిత్రతనుకాపాడాలనిముఖ్యమంత్రి చంద్రబాబుకు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి విజ్ఞప్తి చేశారు.

## దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు బుట్ట ప్రతుల్ ను ఆహ్వానించిన ఆర్యవైశ్య సంఘ సభ్యులు..



విభారె న్యూస్ సెప్టెంబర్ 28 ఎమ్మిగనూరు..స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో 03.10.2024 గురువారం నుండి 12.10.2024 శనివారం వరకు దేవి శరన్నవరాత్రి మహోత్సవములు అంగరంగ వైభవంగా జరుగును. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని వైఎస్ఆర్సిపి యువ నాయకులు బుట్టా ప్రతుల్ ను శనివారం ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు.. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ కార్యదర్శి, కోశాధికారి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

## శ్రీ శ్రీ శ్రీ కాళికామాత దసరా శరన్నవరాత్రి ఉత్సవముల ఆహ్వాన పత్రికను విడుదల చేసిన ఆలయ కమిటీ సభ్యులు.

విభారె న్యూస్ ఆళ్లగడ్డ సెప్టెంబర్ 28 :– ఆళ్లగడ్డ విశ్వరూప నగర్ లో వెలసిన శ్రీ శ్రీ శ్రీ కాళికామాత దసరా శరన్నవరాత్రి ఉత్సవముల ఆహ్వాన పత్రికను కాళికామాత దేవాలయం నందు ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రముఖ శిల్పి దురగడ్డ రవీంద్రచారి. మహిళా కమిటీ అధ్యక్షురాలు దురగడ్డ అనురాధ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు శిల్పి దురగడ్డ రవీంద్రచారి మాట్లాడుతూ 3వ తేదీన కలశ స్థాపనతో ప్రారంభమై 13న వసంతోత్సవంతో ముగుస్తాయన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మూడవ తేదీ న అమ్మవారి కలశ స్థాపన 4వ తేదీన లలితదేవి. 5వ తేదీన లక్ష్మీదేవి మరియు 9 వ తేదీ మూలా నక్షత్రం పురస్కరించుకొని సరస్వతీదేవి అలంకారంలో 10 వ తేదీ న దుర్గాష్టమి. 11 న మహార్నవమి. 12వ తేదీన విజయదశమి పురస్కరించుకొని అమ్మవారి కి సాయంత్రం నాలుగు గంటలకు శమి దర్శనం వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య రాత్రి గ్రామోత్సవం 13న వసంతోత్సవం మహా నివేదనతో కార్యక్రమాలు ముగుస్తాయని అన్నారు. ఆలయ మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**